# మేడ్ ఫర్ ఈచ్ అదర్

''హమ్మయ్య, ఒచ్చేరు కదా?'' అంది మా ఆవిడ చాటంత మొహంతో, నా చేతిలో సూట్ కేస్ అందుకుంటూ.

''ఏం, రాననుకున్నావా? ఇవ్వాళ తిరిగొస్తానన్నానుగా?''

''అవుననుకోండి. అయినా కేంప్ కెళ్ళినప్పుడు, మరో రెండు మూడు రోజులాగి వస్తానని ఎన్నిసార్లు టెలిగ్రాము లివ్వలేదు! అందుకే యివ్వాళ మార్నింగ్‌కల్లా తిరిగి రమ్మని వైరిచ్చేను.''

''ఎందుకా అర్థంలేని టెలిగ్రాం? 'ప్లీజ్ రిటర్న్ సాటర్ డే మార్నింగ్ వితౌట్ ఫెయిల్' అని యిచ్చేవు. ఇక్కడ ఏం కొంపములిగిందో అందులో ఏడిస్తేగా!''

''కొంపలు ములిగితేనే టెలిగ్రామివ్వాలా ఏమిటండీ? మరీ విడ్డూరం!'' అంటూ లోపలికెళ్ళింది.

శనివారం పొద్దున్నే తిరిగి రమ్మంది. ఏమిటీ రోజు ప్రత్యేకత అని రాత్రి తెల్లవార్లు ట్రెయిన్‌లో ఆలోచిస్తూనే వున్నాను. మా యింట్లో కాని, మా బంధుమిత్రుల యిళ్ళల్లో కాని బర్త్‌డేలు, మేరేజ్ ఏనివర్సరీలు, శుభకార్యాలు లేవు. పోనీ, చుట్టాలెవరైనా దిగుతున్నారేమో అంటే నాకు తెలియకుండా నా వైపు బంధువులు ఎవరూ రారు. ఇక మా ఆవిడ బంధుజనులైతే నేనుండాలన్న పట్టింపు లేదు సరికదా, నేను లేకపోతే మా ఆవిడ మరింత సంబరంగా అతిథి మర్యాదలు కొనసాగిస్తుంది. ఎటొచ్చీ తిరిగి రాగానే డెఫిషిట్ బడ్జెట్ అంటూ అంకెలూ, రంకెలూ వేస్తుంది.

''ఏమిటి విశేషం? నీకేమైనా పచ్చి మామిడి కాయ ...'' అంటూ కాఫీ కప్పు అందుకున్నాను. తెలుగు సినీమాలో అయితే ఆ మాట వినగానే భార్య సిగ్గుతో ముడుచుకుపోవడం, భర్త అమాంతంగా కౌగిలించుకుని డ్యూయట్ పాడే తతంగం వుంటుంది. ప్రయాణ బడలికతో యిప్పుడు నాకా ఓపిక లేదు.

''అబ్బే! అలాంటిదేమీ లేదు. తర్వాత చెప్తాను ముందు స్నానం చేసి రండి'' అంది.

''స్నానం అంటున్నావు, ఎవరైనా నరకస్తులయ్యేరా?'' అని అడిగేను దీంతోనైనా సస్పెన్స్‌కి తెరపడుతుందేమోనన్న ఆశతో.

''ఛ! ఛ! అలాంటిదేమీ లేదు మహానుభావా! మీరు స్నానం చేసి బట్టలు మార్చుకుని రెడీ అవ్వండి. మంచి శుభవార్త చెబుతాను. మీరు ప్రైముకి తిరిగొచ్చేరు. అయామ్ సో హేపీ!'' అంది.

భార్య భర్త మీద విపరీతంగా ప్రేమ వొలకబొయ్యడానికి ఓ రీజనూ, సీజనూ వుంటాయి. పుట్టింటికి ప్రయాణం, పట్టుచీర కొనడం, సులభమైన ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో వస్తువులు లాంటి ప్రమాదాలకు అది నాంది వాచకం. ఈ ప్రమాదం గురించి తెలియనివాడూ, దాన్ని తప్పించుకున్నవాడూ ఉండడు. ఎలా వుంటాడు?

ఏ పూర్వ జన్మ తపోబలం వల్లనో మనిషి మొగ జన్మెత్తే వరం సంపాదిస్తాడు. ఆ వరప్రభావం వల్ల అహంకారం తలకెక్కి, కళ్ళు కప్పుకుపోయి, ఆడదాన్ని వరించి పతనమౌతాడు. ఇది యుగ యుగాలుగా వస్తున్న మానవ చరిత్ర సారాంశం.

పురాణగాథలు గురించి మూడు ముక్కల్లో చెప్పాలంటే - తపస్సులు, వరాలు, శాపాలు. ఓ భక్తుడు ఒళ్ళు పై తెలియకుండా తపస్సు చేసి ఓ దేవుణ్ణి ఓ వరం అడగడం. ఆ దేవుడు కళ్ళు మూసుకుని తథాస్తు అనడం, ఆ వరంతో వాడు పేట్రేగి పోవడం, మరో దేవుడు ఆ వరంలో లొసుగులు కనిపెట్టి ఆ వరమే వాడి పాలిట శాపంగా మార్చడం....

అందుచేత ఏతావాతా మనం గ్రహించవల్సిందేమిటంటే - ఆడది శక్తి స్వరూపిణి; మొగాడు ఆమె చేతిలో కీలు బొమ్మ. 'ఎంత వారలైనా కాంతా దాసులే' అని త్యాగరాజు ఊరికే మొరెట్టుకున్నాడా? ఆడదాని ఆకర్షణ అలాంటిది. రావణాసురుడు, భస్మాసురుడు రాక్షసులు. కామంతో కళ్ళు కప్పుకుపోయి నాశనమయ్యేరనుకుందాం. పరాశర, విశ్వామిత్రుల్లాంటి మహర్షులకేం రోగం? తపస్సు చేసుకుంటున్న శివుడికే గిరిజని చూసేటప్పటికి బుద్ధి వెర్రితల వేసింది నరసింహావతారం దాల్చిన విష్ణువు యొక్క ఉగ్రరూపం చెంచులక్ష్మిని

చూడగానే మంచులా కరిగిపోయింది. మరి వెంకటేశ్వరస్వామి తను వరించిన పద్మావతిని పెళ్ళాడటానికి కుబేరుని దగ్గిర చేసిన అప్పు యింతా అంతా కాదు. ప్రపంచ వ్యాప్తంగా హుండీల బ్రాంచిలు పెట్టినా కనీసం అ అప్పు తాలూకు వడ్డీ కూడా తీరేటట్టు లేదు. ఆఫ్టరాల్ మనం మానవ మాత్రులం. మొగాళ్ళుగా జన్మించిన శాపగ్రస్తులం కారణజన్మురాలైన ఆడదాని శక్తిని ప్రతిఘటించడం మన తరమా?

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే - స్నానం చేసి బట్టలు మార్చుకుని టిఫెన్ తీసుకుని ఆఫీసు కెళ్ళే ప్రయత్నంలో డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాను. మా ఆవిడ ఇంటిమేట్ సెంట్‌తో, బంగారు గాజుల గలగల హస్తంతో, లోనెక్ బ్లౌజుతో ముందుకు వొంగి నా ముందో టిఫెన్ ప్లేటుంచి తనో ప్లేటు పెట్టుకుని 'నైవేద్యం ఆరగించండి' అన్న పోజులో నా పక్కన కూర్చోగానే జరగబోయే డేమేజ్ గురించి అంచనా వేస్తూ "ఊఁ - ఇప్పుడు చెప్పు, ఏమిటి విశేషం? టెలిగ్రాం కూడా యిచ్చేవు" అని అడిగేను.

"మా మహిళామండలి ఆదర్శ దంపతుల కాంపిటీషన్ నిర్వహిస్తుందండీ! జడ్జస్ ఏమో చీఫ్ మినిష్టర్ భార్య, లేడీ గవర్నరు'' అంది.

"శుభం చందాలివ్వాలి. అంతేనా?''

"చందా హండ్రడ్ రుపీస్ అనుకోండి. అది యిచ్చేశాను. మీతో సంప్రదించి ఆ కాంపిటీషన్‌కి ఎంట్రన్స్ ఫీజు కడదామనుకుంటున్నాను. ఇవ్వాళే లాస్ట్ డేట్. ఫీజ్ ఎంతో కాదు - టూ హండ్రడ్ రుపీస్!''

"ఆ మాత్రం దానికి నన్ను సంప్రదించడ మెందుకు? ఆఫ్టరాల్ టూ హండ్రడ్....అది సరే, కాంపిటీషనంటే బ్యూటీ కాంటెస్ట్‌లో లాగ దంపతులు స్టేజ్ మీద పెరేడ్ చెయ్యాలా?....అలాంటి పిచ్చి పిచ్చి....''

"అబ్బే, అలాంటిదేమీ లేదండీ! వాళ్ళో కొశ్చనీరిచ్చేరు. అది పూర్తి చేసి....''

"ఎవరు కండక్ట్ చేస్తున్నారీ కాంపిటీషను?''

"వుమెన్ వెల్‌ఫేర్ డిపార్ట్‌మెంట్. ట్విన్ సిటీస్ మొత్తం నాలుగు జోన్స్ చేసి....''

''వాళ్ళిచ్చిన కొశ్చెనీర్ పూర్తి చెయ్యాలి. అంతేనా?''

"పూర్తి చేసి భార్య భర్తలిద్దరూ సంతకాలు పెట్టివ్వాలి.''

''సాక్షి సంతకాలక్కర్లేదా?''

''మనం రాసిన వివరాలన్నీ కరక్టేనని యిద్దరు మహిళా మండలి సభ్యులు సర్టిఫై చేసి సంతకాలు చెయ్యాలి.''

''నాన్‌సెన్స్! మన దాంపత్య జీవితం గురించి ఇంకొకళ్ళు సర్టిఫై చెయ్యడమేమిటి? అయినా ఎవరు చేస్తారు?''

''ఆ విషయం నాకొదిలెయ్యండి. మా మహిళా సంఘం ప్రెసిడెంటు కామేశ్వరీశాస్త్రి సెక్రెటరీ హనుమంతమ్మరావు నాకు బెస్ట్ ఫ్రెండ్స్. వాళ్ళకి మన అన్యోన్యత బాగా తెలుసు. మీరంటే చాలా గౌరవం. వాళ్ళు సర్టిఫై చేస్తామన్నారు. పైగా వాళ్ళ ప్రోత్సాహంతోనే కాంపిటీషన్‌లో పార్టిసిపేట్ చేస్తున్నాను.''

''ట్విన్ సిటీస్‌లో లక్షలకొద్దీ దంపతులుంటారు.''

''దంపతుల్లో ఏ ఒక్కరికీ ముప్పయ్యయిదేళ్ళు మించకూడదు. పెళ్ళయి అయిదేళ్ళకి మించకూడదు. ఒకటికి మించి సంతానం వుండకూడదు.''

"మనకి సంతానమే లేదే?!"

''మరీ మంచిది. దానికి ఎడిషనల్ పాయింట్స్ వుంటాయి.''

''ఈ కాంపిటీషన్ నెగ్గితే ప్రయిజేమిటి?"

''ఫస్ట్ ప్రయిజ్ రెండు వేలు. సెకండ్ ప్రయిజ్ వెయ్యి. పైగా, మన బయోడేటాతో అన్ని పత్రికల్లోనూ మన ఫోటో వేస్తారు''

''అంతేనా? దీని కోసం ఈ కాంపిటీషనూ, గందరగోళం ఎందుకు! మన బయోడేటాతో మన ఫోటోలు పత్రికల్లో పడితే చాలా?''

''ఎవరేస్తారు?''

''నేను వేయిస్తా; ఓసారికాదు - వారం రోజుల్లో రెండుసార్లు వేయిస్తా.''

''ఎలా వేయిస్తారు?''

''సింపుల్. మనం యిద్దరం త్వరలోనే స్టేట్స్‌కి వెడుతున్నామని వేయిస్తాను. వారం రోజులు తర్వాత కారణాంతరాల వల్ల ప్రయాణం వాయిదా పడిందనీ, శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ధన్యవాదాలనీ వేయిస్తాను. సరేనా?''

''ఛ....ఛ....అలాంటి అబద్ధాలు అశుభమండి. అసలు మన కాలనీ మెంబర్లందరూ మనల్ని 'మేడ్ ఫర్ యీచ్ అదర్' అని అభినందిస్తుంటారు. ప్రయిజ్ గన్‌షాట్‌గా మనదేనండి!'' అంది బిక్కమొహం వేసుకుని.

''మళ్ళీ ప్రయిజంటావు! నా మాట విని....''

ప్రయిజ్‌కంటే ముఖ్యం - ఇటీజె మేటరాఫ్ ప్రయిడ్ అండీ! ప్రయిజొస్తే మీ పేరంట్సూ, మా పేరంట్సూ ఎంత సంతోషిస్తారో ఆలోచించండి. ప్లీజ్, కాదనకండి!'' అంది బ్రతిమాల్తున్న ధోరణిలో.

''హూఁ....సరే,క్వెశ్చనీర్ చదువు'' అన్నాను సహజ బలహీనతతో మెత్తబడుతూ.

''పేర్లు, ఎడ్రస్, డేటాఫ్ బర్త్, డేటాఫ్ మేరేజ్, ప్రూఫ్ అఫ్ మేరేజ్ ....దీనికి పెళ్ళి శుభలేఖ పెడితే చాలుట....నా దగ్గిరుంది....తర్వాత కలిసి కాపరం చేసిన కాలం....''

''అదేమిటీ! పెళ్ళయిన రోజు తెలిస్తే ఈనాటి కెన్నాళ్ళుగా కాపరం చేస్తున్నారో తెలీదూ?!''

''ఎలా తెలుస్తుంది? కొందరు పెళ్ళయిన రెండు మూడేళ్ళవరకూ కాపరం పెట్టరు. పెళ్ళవ్వగానే గ్రీన్ కార్డూ, ఎల్లో కార్డూ అంటూ విదేశాలకి చెక్కేస్తారు. ఖచ్చితంగా భార్యాభర్తలు కలిసి కనీసం నాలుగేళ్ళయినా కాపరం చేస్తేనే కాంపిటీషన్‌లో పాల్గొనొచ్చు.''

''ఐసీ. నెక్స్టకాలం?''

''మీది వర్ణాంతర వివాహమా? అంతర్ వర్ణ వివాహమా? ప్చ్....ప్చ్.... ఇక్కడ మనకి పాయింట్లు పోతాయి. మీరు షెడ్యూల్ ట్రైబయితే వది పాయింట్లొచ్చేవి. ఏం జేస్తాం?" అంటూ గొణుక్కుంది.

''తర్వాత చదువు" అన్నాను గడియారం చూసుకుంటూ.

''మీరు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారా? పెళ్ళిచేసుకు ప్రేమించుకుంటున్నారా? బహుశా ప్రేమించి పెళ్ళి చేసుకున్నామని రాస్తే పాయింట్స్ ఎక్కువొస్తాయేమో? ఏమంటారు! ఒక పూర్తి వాక్యం. మీ పేరంట్సు, మా పేరంట్సు ఫ్రెండ్సు. ఎవరు చూడొచ్చేరు! ప్రేమించి పెళ్ళి చేసుకున్నామని రాసేస్తాను.''

'సున్నా పాయింట్స్ వొస్తాయి శాస్త్రోక్తంగా మనకి పెళ్ళిచూపులు, నిశ్చయ తాంబూలాలు అయినట్టు చాలా మందికి తెలుసు. అంచేత అబద్ధమని యిట్టే రుజువవుతుంది. ప్రేమకి పెళ్ళి టెర్మినస్. పెళ్ళయ్యేవరకూనే ప్రేమ. ఆ తర్వాత సమస్యలతో సతమతమౌతుండగా ప్రేమ మాయమౌతుంది. ప్రేమించి పెళ్ళి చేసుకొన్న అయిదేళ్ళ తర్వాత కూడ ఆ దంపతులు ప్రేమించుకుంటున్నారంటే ఎవరూ నమ్మరు.''

''మీదంతా వితండవాదం. సరేలెండి. తర్వాత కాలం.... మీ పెళ్ళి సందర్భంగా తీసుకున్న కట్నాలు కానుకలు, లాంఛనాలు తాలూకు వివరాలు .. నిజం రాస్తే సున్నా మార్కులొస్తాయి.... ఏడిపించేసేరు కదండీ మీ వాళ్లు.... లాంఛనాలు కట్నాలు....''

''వివరంగా రాయి. దాంతోపాటు మీ నాన్న మీ అన్నయ్య పెళ్ళికి పుచ్చుకున్నవి కూడా రాయి. అయినా, మీ నాన్న ఏం జేసుకుంటాడు అంత ఆస్తి?.... నాకు టైమయింది, నే వస్తా.''

''ఉండండి, ఇంకో నాలుగైదు క్వొశ్చెన్స్ వున్నాయి రెండు నిమిషాలు.''

''తొరగా చదువు.''

''మీకు పిల్లలున్నారా? ఉంటే ఎంత మంది? వాళ్ళ డేట్స్ ఆఫ్ బర్త్....

''లేరు.... నెక్స్ట్....''

''మీ భర్తకి ఆడపిల్లలంటే ఇష్టమా కాదా? ఎందుచేత?''

''ఆహా! కాలేజ్‌లో చదువుకునే రోజుల్నుంచీ ఆడపిల్లలంటే యిష్టం. వాళ్ళు నేనంటే పడి చచ్చేవాళ్ళు.''

''మీరేమైనా పార్ట్ టైం బేబీ సిట్టింగ్ జాబ్ చేశారా?''

''వాడ్డూయూ మీన్?''

''ఆడపిల్లలంటే కలగబోయే సంతానం గురించి. కొడుకు కావాలా, కూతురు కావాలా అని. ఇప్పుడు ఆడపిల్లని తెలిస్తే ఎబార్షన్ చేయిస్తున్నారుగా?" అంది మూతి ముడుచుకుంటూ.

''నీకేమి కావాలి?''

''నాకు ఆడపిల్ల కావాలి. మీరు కట్నం తీసుకున్న పాపానికి పరిహారం చెల్లించాలి. నా కళ్ళు చల్లబడాలి''.

''నీకా ఛాన్స్ లేదు. ఇప్పటికే ఆడవాళ్ళ జనాభా మొగాళ్ళ జనాభా కంటే టూ పెర్సెంట్ తక్కువ. నిజానికి పెళ్ళి కొడుకులకు కావలసినంతమంది పెళ్ళి కూతుళ్ళు లేరు. ఈ విధంగా ఆడ జనాభా తరుగుతూ పోతూంటే రేపు మనకి ఆడ పిల్ల పుట్టి దానికి పెళ్ళీడొచ్చేటప్పటికి పెళ్ళి కొడుకులు మనచుట్టూ తిరుగుతారు ఎదురు కట్నమిస్తానంటూ.''

''అలాగే స్వయంవరం పెడుదురు గాని; కలలు కంటూ వుండండి....''

''త్వరగా.... త్వరగా.... తర్వాత?''

''ఈ క్రింది అంశాలపై భార్యా భర్తల మధ్య అభిప్రాయ సామరస్యం గురించి క్లుప్తంగా రాయవలెను. 1. సంపాదన, 2. సామాజిక జీవనం, 3. పొదుపు ఉద్యమం, 4 సాహిత్యాభి రుచి.... సరేలెండి, నేను రాసేస్తాను.''

''ఏం రాస్తావు? ఏమి తెలుసునని రాస్తావు? ముందు ఆ 'ముప్పయి రోజుల్లో కథలు', 'అరవై రోజుల్లో నవలలు' పాతాల పుస్తకాలవతలపారెయ్యి.''

''ఎందుకు పారెయ్యాలి? ఈనాడు ప్రజలకు కావల్సిందేమిటి?''

''తిండీ బట్టా అనుకుంటాను.''

''సామాజిక స్పృహండీ''

''ఐసీ! ఆ యిండస్ట్రీయేదో పెట్టి ప్రజలనుద్ధరించు.... నేహాస్తా.''

''జస్ట్ వన్ మోర్ మినిట్.... లాస్ట్ కాలం ... ప్లీజ్....''

''క్విక్.''

''ఇంటి పనుల్లో భర్త భార్యకు సహాయ సహకారాలెంతవరకూ....''

''పీకల వరకూ.''

''ఉండండి. ఈ క్రింది అంశములను పూర్తి చేయుడు. 1. ఉదయం పాలు ఎవరు తెస్తారు? 'భర్త' అని రాస్తే రెండు పాయింట్లొస్తాయి.''

''మిల్క్ ప్యాకెట్లు యింటికొస్తున్నాయి. హోం డెలివరీ మెంబర్‌షిప్పుంది. అబద్ధమని క్షణంలో రుజువవుతుంది.''

''వంటలో భర్త సహాయము చేయునా? సహాయమా నా బొందా!''

''రుచి చూస్తున్నాను. అది సహాయం కాదా?''

''పనిమనిషి రానపుడు భర్త డిష్ వాషింగ్‌లో సహాయము చేయునా?''

''పది రూపాయలిచ్చి పక్కింటి పనిమనిషి చేత చేయించుకుంటాం.''

''అలా రాస్తే పాయింట్లు పోతాయండి. ఎన్ని పోతాయో ఏమిటో! ఇంక ఆఖరుది.... భర్తకి అనారోగ్యంగా వుంటే భార్య సకల పరిచర్యలు చెయ్యడం పరిపాటి. అట్టి అనారోగ్యం భార్యకే కలిగితే....''

''ఆ అవసరం యింతవరకూ రాలేదని రాయి.''

''అలా రాయడం కంటే ఈ ఫారం చింపెయ్యడం మంచిది. మీకన్నింటికీ సంకోచాలే. మరి మా హనుమంతమ్మగారి భర్తలేడూ....''

''ఎందుకు లేడూ! దున్నపోతులా వున్నాడు. వాళ్ళావిడ క్లబ్‌లో తెల్లవార్లూ పేకాడుకుంటుంది. వీడు పొద్దున్నే నేను జాగింగ్ కెళ్ళేటప్పుడు, న్యూస్ పేపరు పట్టుకుని మిల్క్‌బూత్ దగ్గర క్యూలో ప్రత్యక్షం. వాడు యింట్లో అంట్లు తోముతాడు. పెళ్ళాం కాళ్లూ పడతాడు'' అంటూ లేచేను.

''వుండండి. ఈ ఫారం మీద సంతకం పెట్టి వెళ్ళండి.''

''నువ్వు ఫిలప్ చెయ్యి, సాయంత్రం పెడతాను.''

''అంత టైముంటే రమ్మని టెలిగ్రాం ఎందుకిస్తాను? పది గంటల్లోగా వాళ్ళకిచ్చెయ్యాలి. నేను ఫిలప్ చేస్తాను లెండి. నా మీద నమ్మకం లేకపోతే మీరే ఫార్మ్ ఫిలప్ చేసి సంతకం బెట్టండి'' అంటూ మాఆవిడ గొణుక్కుంటుండగా ఫార్మ్ సంతకం పెట్టి యిచ్చేశాను. తర్వాత దాన్ని గురించి మరిచిపోయి పదిహేను రోజులయింది.

*　　　*　　　*

జాగింగ్ చేసుకుంటూ పోతుంటే ''గుడ్ మార్నింగ్!'' అన్న పలకరింపు విని పక్కకి తిరిగేను. హనుమంతమ్మగారి భర్త వెంకట్రావు పాల పేకట్లు చేత్తో పట్టుకుని నిలబడి ఓ విషపు నవ్వు నాపై విసిరి మరో చేత్తో న్యూస్ పేపరు నా వైపు చాచేడు.

''గుడ్ మార్నింగ్!'' అన్నాను.

''హార్టీ కంగ్రాట్స్!''

''దేనికి?''

''ఆదర్శ దాంపత్యానికి. ట్విన్ సిటీస్ మొత్తంమీద ఫస్ట్ ప్రయిజ్ కొట్టేసినందుకు!''

''మీకెలా తెలుసు?''

''ఇదిగో పేపర్లో పడింది. నాకు తెలిసిందల్లా మీకు వంట వచ్చుననీ, అవసరం వొస్తే అంట్లు తోమడం, మీ ఆవిడకాళ్ళు ...''

జాగింగ్ మానేసి రన్నింగ్ చేస్తూ యిల్లు చేరుకున్నాను. నన్ను చూడగానే మా ఆవిడ పేపర్ చూపెడుతూ "ఫస్ట్ ప్రయిజ్ మనదేనండి. ఇదిగో పేపర్లో మన ఫోటోలు కూడా వేశారు'' అంటూ ఆనందంతో చిందులు తొక్కుతూంటే కైకకు వరాలిచ్చి దుఃఖించిన దశరథుడులాగ సోఫాలో కూలబడ్డాను.

*

(రచన నచిత్ర మాస పత్రిక, ఫిబ్రవరి, 1993.)